
# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA_533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :** **J. C. CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 9 డిశంబరు 1988 సంచిక 5

## సంపాదకీయము

### లేఖనములను ప్రత్యేకించుట

### ( *Isolating Scriptures* )

కొన్ని సిద్ధాంతములను బోధించడానికి, నిరూపించడానికి బైబిలులోని కొన్ని లేఖనములను ప్రత్యేకపరచు అలవాటు చాలమందికి ఉన్నది. విశ్వాసము, మారుమనస్సు, ప్రార్థన, కృప మొదలగు అంశములను గూర్చి బోధించునప్పుడు సాధారణంగా ఈ పనిని చేస్తారు. ఉదాహరణకు విశ్వాసమునుగూర్చి బోధించునప్పుడు యోహాను 3:16, రోమా 10:10 ని చూపించి మనకు విశ్వాస మొక్కటే చాలునని బోధిస్తారు. మానవుని రక్షణలో విశ్వాసము యొక్క ప్రాముఖ్యతను బైబిలు బోధించుచున్నది నిజమే. అయితే విశ్వాసమునుగూర్చి చెప్పే వచనాలన్నీ ప్రత్యేక పరచిన తరువాత, రక్షణ విషయంలో మిగతా విషయాలను గూర్చి బోధించే లేఖనముల పని యేమిటి? బాప్తిస్మమును గూర్చి గాని, మారుమనస్సును గూర్చి గాని బోధించే లేఖనాలను ప్రత్యేక పరచి, బైబిలు బాప్తిస్మము ఒక్కటి మాత్రమే చాలు

వని గాని, మారుమనస్సు ఒక్కటి మాత్రమే చాలునని గాని బోధించు చున్నదని చెప్పవచ్చు గదా?

అయితే నిజానికి ఏ ఒక్కటి దానికదే రక్షించదు. విశ్వాసము ఒక్కటి మాత్రమే (Faith Only) ఎట్లు రక్షించదో, బాప్తిస్మ మొక్కటి మాత్రమే రక్షించదు. బైబిలును చదివిన తరువాత వీటిలో ఏ ఒక్కటి మాత్రమే రక్షించునని సంగ్రహించలేము. నిజానికి లేఖన విరుద్ధమైన సంగతులు అనేకులకు బోధింపబడ్డాయి. ఆ అసత్య సిద్ధాంతాలను నిరూపించడానికి వారికి పనికివచ్చే వచనాలను ప్రత్యేక పరుస్తారు. బైబిలు వచనాలను సందర్భరహితంగా వినియోగించుటవలన దేనినైనా 'నిరూపించవచ్చునని' ఒకరు చెప్పారు. అయితే అది లేఖనములను దుర్వినియోగపరచినట్లే అవుతాది.

లేఖనములనట్లు చులకనగా వినియోగించడం చాల ప్రమాదకరం. ఏ అంశములను గూర్చియైనను బైబిలు యేమి చెప్పుచున్నదో దాన్ని నేర్చుకోడానికి మనం ప్రయత్నం చేయాలి. మనకిది వరకు ఏమి బోధింపబడినను, మన మేమి నమ్మినను, దాన్ని త్యజించి బైబిలు చెప్పు దానినే మనం అంగీకరించాలి. సత్యము సత్యమే. అదెన్నటికి మార్చబడదు.

దేవుని వాక్య పఠన విషయంలో మనం జ్ఞాన యుక్తముగా నడవాలి. మొదటిగా బైబిలు యేమి చెప్పుచున్నదో జాగ్రత్తగా వినాలి. రెండవదిగా, ఏ వచనమునైనను దాని సందర్భమునుండి వెలికి తీసి ప్రత్యేక పరచకూడదు. మూడవదిగా, ఏ అంశమును గూర్చియైనను బైబిలు బోధించున దంతయు సంగ్రహించాలి. నాల్గవదిగా ఒక లేఖనానికి విరుద్ధముగా మరొక దాన్ని ప్రయోగించి బైబిలు స్వవిరుద్ధ సంగతులను బోధించుచున్నదని చెప్పుటకు ప్రయత్నించరాదు. ఐదవదిగా, సరిగా అర్థము చేసికొనిన లేఖనములు మనలను ఏకము

చేస్తాయి గాని వేరుపరచవు. విశ్వాసము మాత్రమే, లేక క్రియలు మాత్రమే లేక వేరొకటి మాత్రమే యేదీ మనలను రక్షించదు. ప్రభువు తన్ను వెంబడించువారినుండి ఎల్లప్పుడు విశ్వాసము, విధేయత కోరాడు. ఆరవదిగా మన పఠన ఫలితాన్ని ప్రశ్నించకుండా మనం అంగీకరించాలి.

“ఒకడు తన ఊహాను బట్టి చెప్పుటవలన లేఖనములలోని ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెనని” పేతురు చెప్పాడు (2 పేతురు 1:20). “ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెనని” కూడ అతడు చెప్పాడు (1 పేతురు 4:11). మనము లేఖనములను బట్టి నడుచుకొనువారమై యుండాలని యాకోబు చెప్పాడు (యాకోబు 1:22). మనం పరలోక తండ్రి చిత్తాన్ని నెరవేర్చాలని యేసుక్రీస్తు చెప్పాడు (మత్తయి 7:21).

మనం లేఖనాలకు కలుపుటగాని, వాటినుండి తీసివేయుటగాని జరిగించకూడదు (ప్రక 22:18, 19). పరలోకమునుండి వచ్చిన దూతయైనను వేరొక సువార్తను ప్రకటించినయెడల శాపగ్రస్తుడవునని పౌలు చెప్పాడు (గలతీ 1:6-9). మనము క్రీస్తును నిరాకరించి ఆయన మాటలను గైకొనని యెడల, ఆయన చెప్పిన మాటలే అంత్యదినమందు మనకు తీర్పు తీర్చునని క్రీస్తు చెప్పాడు (యోహాను 12:48).

ప్రభువుకే సమస్త శక్తి అధికారములున్నవి (మత్తయి 28:18). ఆయన వాక్యమైన దేవుడు (యోహాను 1:1-5). ఆయన తన కుమారుని యందు ఆనందించుచున్నట్లును, మనం ఆయన మాటలను వినవలెనని దేవుడే పరలోకంనుండి పలికాడు (మత్తయి 17:5). అట్లు చేయువారు జ్ఞానులగుదురు (మత్త 7:24-29). దేవుని ఆజ్ఞలను నెరవేర్చువారు ధన్యులు.

మనం దేవుని ఆజ్ఞలను విని వాటి చొప్పున చేయునప్పుడు

ఆయన తన కృపద్వారా అనుగ్రహించు రక్షణను అంగీకరించుదుము (ఎఫెసీ 2:8, 9). మనమాయన ఆజ్ఞలకు లోబడకపోతే ఆయన మనల నెట్లు రక్షిస్తాడు? గనుక మనం దేవుని వాక్యాన్ని విని దానికి లోబడితే, అది రక్షణలోనికి మనలను నడుపును. దాన్ని మనం అపార్థం చేసికొని, అక్రమంగా చిత్రీకరిస్తే అది మనలను నాశనం చేయును. ఎప్పటివలెనే ఈ నిర్ణయం మనకే వదలివేయబడినది. మనం సరైన నిర్ణయం చేయుదుము గాక!

★

## హితబోధ

ఎవడైనను మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క హిత వాక్యములను దైవ భక్తికి అనుగుణ్యమైన బోధను అంగీకరింపక భిన్నమైన బోధ నుపదేశించిన యెడల అట్టివాడు రిక్తుడు వ్యర్థుడు గర్వాంధుడై యుండునని (1 తిమోతి 6:3-5) పౌలు చెప్పాడు. తనను గూర్చియు తన బోధను గూర్చియు జాగ్రత్తపడుమని తిమోతిని హెచ్చరించెను (1 తిమో 4:16).

బోధకులైనవారు ఈ హెచ్చరికను విస్మరించరాదు. బోధకుడు యోగ్యుడు మాన్యుడై యున్నప్పుడే అతని బోధ విన్నవారు సద్వర్తనులు కాగలరు. తమ ఆత్మలను రక్షించుకొనగోరు వారు పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధయందు నిలిచియుండవలయును (యూదా : 3). అపొస్తలులకు అప్పగింపబడిన బోధనే హితబోధ యందురు. మూల భాషలో అది (Sound Doctrine) ఆరోగ్యకరమైన బోధ యని చెప్పబడుచున్నది (2 తిమోతి 4:3).

ఈనాడు అపొస్తలుల బోధను ప్రక్కకు నెట్టి వారి ఉపదేశ సారమును వదలిపెట్టి కొందరు వారి స్వంత బోధలు ఉపదేశములు ప్రయాసముతో ప్రకటించుచున్నారు. ప్రపంచ వ్యాప్తముగ పదకొండు

వందల పైచిలుకు క్రైస్తవ మతశాఖలు సువార్త ప్రకటన యను పేరుతో స్వవిరుద్ధ సంఘములను స్థాపించుటలో ఎక్కువ పని కలిగి యున్నవి.

## అపొస్తలుల బోధ

అపొస్తలుల బోధ సంఘమునకు వెన్నెముక వంటిది. ఆ బోధను అపొస్తలులు క్రీస్తునుండి పొందియున్నారు. సువార్తను ప్రకటించుడి అని క్రీస్తు వారి కాజ్ఞాపించెను (మార్కు 16:16; మత్తయి 28:20). అపొస్తలుల బోధ యను వెన్నెముకలేని సంఘములు సాతాను బోధల యందు నిలిచియుండి వాతవేయబడిన మనస్సాక్షి గలవిగా యున్నవి (1 తిమోతి 4:1-2).

సువార్తలో దేవుని శక్తి గలదు (1 కొరింథి 1:18). దేవుని మహిమ గలదు (1 తిమోతి 1:8). ఒకడు సువార్తను వినకుండ రక్షింప బడనేరడు. కందాకే రాణి యొక్క అర్థిక మంత్రి యగు నపుంసకుడు ఫిలిప్పు సువార్త ప్రకటించగా విని, విశ్వసించి, బాప్తిస్మము పొంది రక్షణానందముతో వెళ్లెను. దానశీలియు ప్రార్థనాపరుడునైన కొర్నేలి, పేతురు సువార్త ప్రకటించిన తదుపరి రక్షింపబడినట్లుగా లేఖనాధార ములు గలవు (అ. కార్య 8:26-38; 10వ అధ్యాయము). సువార్తను వినుటద్వారానే ఒకడు విశ్వాసములోనికి వచ్చును (రోమా 10:17). మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నామని పౌలు చెప్పెను (1 కొరింధీ 1:23). మనుష్యుడు రక్షింపబడుటకు సువార్త ప్రకటన అవసరమై యున్నది. గనుకనే సువార్తను గూర్చి నేను సిగ్గు పడువాడను కానని పౌలు అనెను (రోమా 1:16). అయ్యో సువా ర్తను నేను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ, యని అత డంగ లార్చెను (1 కొరింధి 9:16).

సువార్త ప్రకటన యను భారము మోయలేనివారు దుర్వా

ర్తలు ప్రాచుర్యము చేయుచున్నారు. నేడు కొందరికి సుఖమగు జీవనోపాది సువార్త ప్రకటనే యని భావించుచున్నారు. వారు క్రీస్తు సువార్తను ప్రకటించ లేకపోగా ఆయన నామమును అవమాన పరచుచున్నారు. ఇట్టి వారిని గూర్చి పౌలు పరితపిస్తూ యిలా వ్రాస్తున్నాడు. "నాశనమే వారి అంతము. వారి కడుపే వారి దేవుడు; భూసంబంధమైన వాటియందే మనస్సు నుంచుచున్నారు" (ఫిలిప్పీ 3:19). సువార్త ప్రకటన ప్రకటించువారికిని రక్షణార్థముగ పరిణమించును. గనుక ఎదిరించు వారికి బెదరక సువార్త విశ్వాసపక్షమున పోరాడుచు సువార్త ప్రకటించువారు క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తింపవలయును (ఫిలిప్పీ 1:15-28). మీకు రక్షణ కలుగుటకు యిది సూచనయై యున్నది.

## భిన్నమైన సువార్త

నేడు కొందరు బోధకులు ఆచార్యులు, రెవరెండ్లు, అపొస్తలులు అని పిలువబడుచున్నారు. వారు క్రీస్తుయొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగలు మోసగాండ్రగు పనివారునై యున్నారు (2 కొరింథి 11:13-15). అట్టివారు ప్రకటించునది క్రీస్తు సువార్త కాదు. అది దయ్యముల బోధయై యున్నది. బంగారు వన్నెగల వస్తువు లన్నియు బంగారము కాజాలవు. పుటము వేయబడినప్పుడు బంగారముయొక్క వన్నె తరుగదు. దాని విలువ కోల్పోదు. అటులనే సువార్త లన్నియు సువార్త కాజాలవు. భిన్నమైన సువార్త లున్నవని వాటి తట్టు తిరుగవద్దని అపొస్తలుడు చెప్పెను (గలతీ 1:6-12).

## పౌలు ప్రకటించిన సువార్త ఎట్టిది?

అతడు క్రీస్తుయొక్క మరణమును, సమాధిని, పునరుత్థానమును సువార్తగా ప్రకటించెను (1 కొరింథి 15:1-11). ఈ సువార్తలో మనిషి మనుగడకు మార్పు చెంది జీవించుటకు మూడు ప్రాముఖ్యమగు అంశము లున్నవి.

మొదటిది, క్రీస్తుయొక్క మరణము :- మనిషికి మారుమనస్సుకు సూచనగా యున్నది.

రెండవది, క్రీస్తుయొక్క సమాధి :- నీటి బాప్తిస్మముద్వారా పాపములు పూడ్చిపెట్టుట.

మూడవది, క్రీస్తు పునరుత్థానము :- నూతన జీవితమునకు లేదా క్రొత్తజన్మ అనుభవమును రుజువు చేయుచున్నది (రోమా 6:1-11).

సువార్త వినినవారు తిరిగి జన్మించినవారై రక్షణానుభవములో క్రీస్తును ధరించుకొనినవారై (గలతీ 3:27-29), మూర్ఖులగు వంకర తరము వారికి వేరుగా యుండవలయును. వీరు అపొస్తలుల బోధ యందును, సహవాసమునందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట, కానుక లిచ్చుట యను కార్యసాధకులు కావలయును (అ. కార్య 2:37-42). ఒకడు నీటి మూలముగను ఆత్మ మూలముగను జన్మించకుంటే దేవుని రాజ్యము లో ప్రవేశింపలేడని యేసుప్రభువు నీకోదేముతో చెప్పారు (యోహాను 3:5).

దేవుని రాజ్యము అనగా దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమే! ఆ సంఘమునకు శిరస్సు క్రీస్తే. సంఘము ఆయన శరీరము (కొలస్స 1:18; ఎఫెసి 1:22).

సంఘమే రాజ్యము:- లూకా 1:32; మత్తయి 16:18, 19; కొలస్స 1:13.

తప్పుడు సిద్ధాంతములు బోధలనుండి తప్పించుకొని లేఖనములు పరిశీలిస్తూ సంఘము జాగ్రత్తగా నుండవలయును. మత్తయి 24:24. అ. కార్య 20:28-30; గలతీ 1:7-9.

సంఘముయొక్క పేరు వాక్యము ననుసరించియే ఉండవలెను ఫిలిప్పీ 2:9-11; రోమా 16:16.

క్రీస్తు సంఘములో నీవొక అంగమై యుండుటకు లేదా దేవుని రాజ్యములో నీవు ప్రవేశించుటకు లేఖనానుసారముగా,

వాక్యము విని (రోమా 10:14). విశ్వసించి, (అ. కార్య 16:31, రోమా 10:17), మారుమనస్సు పొంది (అ. కార్య 17:30), యేసు ప్రభువని ఒప్పుకొని (రోమా 10:9-10), బాప్తిస్మముద్వారా, (రోమా 6:3-5) రక్షణ పొందుము (మార్కు 16:16). ప్రభువు హస్తము నీకు తోడై యుండును గాక!

—సామ్యూల్ జాన్ మేడిది, కోణితివాడ.

---

## బాప్తిస్మము సంఘము

### (*Baptism and Church*)

క్రైస్తవ సంఘమని చెప్పుకొనే ప్రతి సంఘము బాప్తిస్మము నలవరుస్తాది. దాని ప్రయోజనము, అభ్యాసము ఒక డినామినేషన్ నుండి వేరొక దానికి వేర్వేరుగా యుండవచ్చు. కొందరు నీళ్ళలో ముంచుతారు, కొందరు నీళ్ళను చిలకరిస్తారు లేదా కుమ్మరిస్తారు. అయితే ఇంచుమించు అన్ని సంఘాలు వాటిలో సభ్యత్వం కొరకు బాప్తిస్మము పొందాలంటారు. బాప్తిస్మమునుగూర్చి ఏ సంఘమైనా చేయు బోధనాచారములను గూర్చి మనం ఆసక్తి కలిగి యున్నాము సరిగదా ఈ అంశముపై బైబిలు చేయు బోధను గూర్చి మరింత ఆసక్తి కలిగియున్నాము.

బాప్తిస్మానికి సంఘానికి ప్రాముఖ్య సంబంధమున్నది. ఈ సంబంధాన్ని ఐదు కోణములద్వారా మనం పరిశీలింతము.

### 1. సంఘము దేవుని కుటుంబము

సంఘానికి బాప్తిస్మానికి గల సంబంధాన్ని గూర్చి చెప్పుకొనుట ఒక కుటుంబానికి దానిలో జన్మానికి గల సంబంధాన్ని గూర్చి చెప్ప

# Kakinada School of Preaching

**(A work of the Churches of Christ)**

cordially invites you to

## A BIBLE SEMINAR

with

**Perry B. Cotham**

***Place :*** Sri Pynda Chalamayya Kalyanamandapam
**Temple Street, KAKINADA-1.**

***Dates :*** Dec. '88 10 To 16 (Saturday to Friday)

***Times :*** 10–00 a.m., 3–00 p.m. and 6–30 p.m.

Mr. Cotham is an outstanding evangelist and internationally re-nowned Bible teacher. This is your invitation to come and hear Mr. Cotham as he teaches great subjects from the Bible. Preachers and Leaders of the Churches of Christ and ALL denominations are invited. Free food and accomodation is available for all those coming from far off places.

*Please Come and Bring Your Friends* !

---

KAKINADA SCHOOL OF PREACHING
10–4–35, Seshagirirao Street, Ramaraopet,
KAKINADA–533 004.

# బైబిల్ సెమినార్

స్థలము : పైండా చలమయ్య కళ్యాణమండపం
దేవాలయం వీధి, కాకినాడ-1

తేదీలు : **1988** డిశంబరు **10** నుండి **16** వరకు

సమయం : 10–00 a.m. to 3–00 p.m. and 6–30 p.m.

ప్రసంగీకులు : Bro. పెర్రి కోతమ్, USA

(గొప్ప బైబిలు విద్వాంసులు)

అందరికీ ఆహ్వానం। అందరికీ మా స్వాగతం ।।

సంఘ నాయకులు, సభ్యులు తప్పక విచ్చేయ ప్రార్థన.

దూరము నుండి వచ్చు వారికి భోజన వసతులు ఉచితం.

మీ మిత్రులతో రండి.

---

వివరములకు : **KAKINADA SCHOOL OF PREACHING**
**Ramaraopet, Kakinada–533 004.**

కొనుటయే. ఒక శిశువు జన్మించినప్పుడు ఆ కుటుంబములో ఒక నూతన వ్యక్తి ఉద్భవిస్తాడు. దీన్ని గూర్చిన చర్చలు యేమి అక్కర్లేదు, నిర్ణయాలు కూడ అక్కర్లేదు. ఆ శిశువు స్వాభావికంగానే కుటుంబ సభ్యుడౌతాడు.

సంఘము దేవుని కుటుంబము. దానిలో ఆయన బిడ్డలుంటారు. ఒకడు తిరిగి జన్మించినప్పుడు అతడా కుటుంబములో సభ్యుడో కాదో యను దానిని గూర్చిన చర్చ యేమీ వుండదు, నిర్ణయాలు కూడా యేమీ వుండవు. అతడు తిరిగి జన్మించినందున దేవుని కుటుంబములో యున్న దేవుని బిడ్డ. దేవుని కుటుంబమే దేవుని సంఘమని పౌలు వ్రాయుచున్నాడు (1 తిమో 3:15). అదే అధ్యాయములో సంఘ పెద్దగా యుండగోరువాడు, "సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరుచుకొనుచు తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. ఎవడైనను తన యింటివారిని ఏలనేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును"? అని పౌలు చెప్పాడు (4, 5 వచనములు). ఒకడు దేవుని బిడ్డలను పాలించుటకు మొదలిడక ముందు, అతడు తన యింటివారిని బాగుగా పాలించువాడై యున్నట్లు నిరూపించుకొనాలని పౌలు చెప్పుచున్నాడు. సంఘాన్ని అతడిక్కడ దేవుని కుటుంబముగా, దేవుని బిడ్డలుగా చెప్పుచున్నాడు.

గలతీయులకు వ్రాయుచు, ప్రజలు దేవుని కుటుంబములో భాగస్థు లెట్లవుతారో పౌలు వివరించుచున్నాడు: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26, 27). ఈ లేఖనాన్ని గూర్చి క్రిసోస్టోమ్ ఇట్లు వ్రాసాడు: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు దేవునివలన జన్మించినవారని అతనెందుకు చెప్పలేదు? వారు కుమారులైతే ఇది సహజమేగదా!

ఎందుకనగా అతడొక ఆశ్చర్యకరమైన ప్రతిపాదన చేయుచున్నాడు; ఎట్లనగా క్రీస్తు దేవుని కుమారుడైన యెడల, నీవాయనను ధరించుకొనిన యెడల, కుమారుడు నీయందుండి, నీవాయన సారూప్యముగా మల్చబడి ఆయనతో కూడ దేవుని కుటుంబములోనికి ఆయనవలె తేబడితివి" (Alford : The N.T. for English Readers).

ఈ లేఖనము సంఘానికి బాప్తిస్మానికి గల ఖచ్చిత సంబంధాన్ని నిరూపించుచున్నది. దేవుని బిడ్డలతో సంఘము సమకూడి యున్నది. బాప్తిస్మము పొందుట ద్వారా ప్రజలు దేవుని బిడ్డలు కాగలరు.

## 2. తిరిగి జన్మించినవారే సంఘము

క్రొత్తజన్మ అనగా యేమిటో మత గురువులు భిన్నాభిప్రాయములు కలిగియుండవచ్చును. అయితే రక్షింపబడుట తిరిగి జన్మించుట సమానమేనని అందరు ఒప్పుకొంటారు. తిరిగి జన్మించిన వారితో సంఘము సమకూడి యున్నది.

దేవుని రాజ్యము పలు విధములుగ మనకు వర్ణించబడినది. దేవుని రాజ్య తత్వాన్ని గూర్చి వివరించుట ఈ వ్యాసము యొక్క ఉద్దేశ్యము కాదు గాని క్రొత్త నిబంధనలో అది మన ప్రభువైన యేసుక్రీస్తు సంఘమని వర్ణింపబడినది. అందువలన నీకొదేముతో మాట్లాడుచు క్రీస్తు సంఘాన్ని బాప్తిస్మాన్ని ఇట్లు కలిపాడు : "ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను 3:5).

దీనిపై ఆల్ఫర్డ్ ఇట్లు వ్యాఖ్యానించాడు : "సహృదయంతో ఈ మాటల భావం చెప్పాలంటే, నీటి మూలముగ జన్మించుట యనగా బాప్తిస్మము పొందుటయే అనుటలో సందేహము లేదు". నిజానికి అన్ని డినామినేషన్ల పండితులు ఇక్కడ చెప్పబడిన నీరు బాప్తిస్మమును సూచించుచున్నదని గుర్తించుదురు. ఆత్మవలన నడిపింప

బడిన వారమై మనము ఆ బాప్తిస్మమునకు వత్తుము. మరల బాప్తిస్మము పొందుటవలన మనలో నివసించు పరిశుద్ధాత్మ వాగ్దానము చేయబడింది. రాజ్యములో ప్రవేశించుట కది అత్యవుసరమని మన ప్రభువు ఇక్కడ సూచించాడు. తద్వారా జన్మించిన ప్రతివాడు రాజ్యములో ప్రవేశించునని దీని భావము.

## 3. సంఘము క్రీస్తు పెండ్లికుమార్తె

సంఘము క్రీస్తు పెండ్లికుమార్తె యను అలంకారములో సంఘానికి బాప్తిస్మానికి గల సంబంధము గోచరమగుచున్నది (ఎఫెసీ 5:22, 23). "క్రీస్తు సంఘమును ప్రేమించి...వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధ పరచుటకై దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను."

వివాహమునకు ముందు వధువు పవిత్రపరచుకొనే స్నానము నట్లు చేయునో అట్లే సంఘము కూడాను (ప్రక 21:2). బాప్తిస్మములో ఉన్నత ఆదర్శ ప్రయోజనములు ఇమిడి యున్నాయి. దీని బాహ్య సంస్కారములో ఆంతరంగిక కృప మిళితమై యున్నాయి. అందువలన క్రీస్తు బాప్తిస్మము ద్వారా సంఘాన్ని పవిత్రపరచాడనుట దైవిక సత్యము (Neander) (1 పేతురు 3:21). మరల ఈ లేఖనము లోని 'నీరు' బాప్తిస్మమును సూచించుచున్నదని సార్వజనికంగా అంగీకరించబడినదే.

2 కొరింథీ 11:2లో సంఘము ఒక్కడే పురుషునికి అనగా క్రీస్తుకు ప్రధానము చేయబడినట్లు పౌలు చెబుతాడు. రోమా 7లో, మృతులలోనుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై వారు ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరని అతడు చెప్పాడు. వారు క్రీస్తు వధువువలె యుండుటకు ముందు పవిత్రస్నానము ద్వారా పరిశుద్ధపరచబడాలి. క్రీస్తు అను పెండ్లి కుమారుని యెదుట సమర్పించబడు

టకు ముందు యిది జరగాలి. క్రీస్తు సంఘములో యుండుటకు బాప్తిస్మము యొక్క అవుసరాన్ని ఇక్కడ మనం చూడగలము.

## 4. రక్షించబడినవారే సంఘము

సంఘము ఆరంభమైన విధానమే బాప్తిస్మము ఒకని సంఘ సభ్యత్వములోనికి, సహవాసములోనికి ప్రవేశింపజేయునని విశదీకరించుచున్నది.

పెంతెకోస్తునాడు క్రీస్తును అప్పగించి సిలువ వేసిన ప్రజలే దేవుని విమోచన ప్రేమనుగూర్చి విన్నప్పుడు, దేవుని కుమారుని వారు చంపించారని గ్రహించుకొన్నారు. యిది వారి హృదయములను గ్రుచ్చినది. అందువలన సహోదరులారా, మేమేమి చేతుమని అడిగారు (అపో. కా. 2:37). మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని వారికి చెప్పబడింది. ఈ మాటను మూడు వేల మంది సంతోషముతో అంగీకరించారు, వారు బాప్తిస్మము పొందారు. వారు సంఘముతో చేర్చబడ్డారు. మరియు రక్షణ పొందుచున్న వారిని ప్రభువు అనుదినము సంఘముతో చేర్చుచుండెను (అపో. కా. 2:38-47). అంటే పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారందరు రక్షింపబడినందున, ప్రభువుచే సంఘముతో చేర్చబడుచున్నారని దీని యర్థము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వాని నెవనినైనను ఈనాడు కూడ ప్రభువు తన సంఘముతో చేర్చుతాడు.

రక్షింపబడడానికి బాప్తిస్మము అవుసరం గనుక (మార్కు 16:16; అపో. కా. 2:38; 22:16), రక్షింపడినందున ఒకడు సంఘములో ప్రవేశిస్తాడు గనుక, బాప్తిస్మము సంఘ సభ్యత్వానికి అత్యవుసరం.

## 5. సంఘము క్రీస్తు శరీరము

బాప్తిస్మమునకు సంఘమునకు గల సంబంధాన్ని పై నదహ

రించిన సంగతులు అతి విపులంగా విశదీకరించినను, ఈ సందర్భములో 1 కొరింథీ 12:12, 13లో చెప్పబడిన అత్యంత ప్రాముఖ్యమైన విషయం గమనించదగినది: "ఏలాగు శరీరము ఏకమై యున్నను అనేకమైన అవయవములు కలిగి యున్నదో యేలాగు శరీరముయొక్క అవయవములన్నియు అనేకములై యున్నను ఒక్క శరీరమై యున్నవో, అలాగే క్రీస్తు ఉన్నాడు. ఏలాగనగా.. మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి". ఆ ఒక్క శరీరమేమైయున్నను, మనము దానిలోనికి బాప్తిస్మము పొందితిమని యిది చెప్పుచున్నది.

క్రీస్తునుగూర్చి కొలస్స 1:18 ఇట్లు చెప్పుచున్నది: "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను". క్రీస్తు సంఘమునకు శిరస్సు. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నదని ఎఫెసీ 1:23 చెప్పుచున్నది.

సంఘము నిస్సందేహముగా క్రీస్తు శరీరమై యున్నది, క్రీస్తు దానికి శిరస్సు. ఎవరైతే ఆ ఒక్క శరీరమైయున్నారో వారా శరీరములోనికి బాప్తిస్మము పొందినవారనునది కూడ నిస్సందేహము. గనుక లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందినవారు సంఘముతో సమానమనునది దృఢమైన వాస్తవము.

ఈ క్లుప్త పాఠాన్ని సంగ్రహిస్తూ కొన్ని విషయాలను గమనిద్దాం :

1. సంఘము దేవుని సృష్టము. క్రీస్తు దాన్ని నిర్మాణికుడు (ఎఫెసీ 3:10, 11; మత్త 16:18).
2. సంఘము దేవుని గృహము, దేవుని కుటుంబము, దేవుని కుమారులు (1 తిమో 3:5, 15). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవారు దేవుని కుమారులవుతారు (గలతీ 3:26, 27).

3. క్రీస్తునందు కడుగబడి ప్రతిష్ఠింపబడి నీతిమంతులుగా తీర్చబడినవారి సహవాసమే సంఘము (1 కొరి 1:2; 6.9-11).

4. రక్షింపబడి ప్రభువుచే దానితో చేర్చబడినవారే సంఘము (అపొ. కా. 2:41, 47).

5. సంఘము క్రీస్తు శరీరము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవారు దానితో చేర్చబడుదురు (అపొ. కా. 2:38, 41, 47; 1 కొరి 12:13).

6. ఒకడు నీటిమూలముగను ఆత్మమూలముగను తిరిగి జన్మిస్తేనే గాని సంఘములో లేక దేవుని రాజ్యములో ప్రవేశించలేడు (యోహాను 3.3-5).

7. సంఘము క్రీస్తు పెండ్లికుమార్తె. అది వాక్యమను ఉదకస్నానముచేత పవిత్రపరచబడినది (ఎఫె 5:25-27).

8. దేవుని సహవాసములో యుండాలనుకొనేవారు పాపవిముక్తి పొందుట అవుసరం. దేవుని పరిశుద్ధ కుటుంబము విమోచింపబడిన వారితో సమకూడాలి. రక్షింపబడినవారి సహవాసములో ప్రవేశించువారు రక్షింపబడినవారై యుండాలి.

మన పాపములను కడిగివేయుటకు (అపొ. కా. 22:16), రక్షించుటకు (మార్కు 16:16), క్రీస్తును ధరించుకొనుటకు (గలతీ 3:27) బాప్తిస్మము అవుసరం గనుక సంఘముతో చేర్చబడడానికి, రాజ్యములో ప్రవేశించడానికి, క్రీస్తు శరీరములో భాగమవడానికి అది అవుసరమని గ్రహించుకోగలము.

—లూయిస్ జి. హేల్.

---

# క్రైస్తవులు సబ్బాతు నాచరించాలని దేవుడు కోరుచున్నాడా ?

## *(Does God Require Sabbath Keeping of Christians?)*

బైబిలు పఠనమందు ఇది ప్రాముఖ్యమైన విధి. ఇందు మనం ప్రశ్నించుకోదగిన మూడు ప్రశ్న లున్నాయి. ఎవరు మాట్లాడుచున్నారు? ఆయన ఎవరితో ఈ మాటలు పలుకుచున్నాడు? ఆయన దేని కొరకు మాట్లాడుచున్నాడు? సబ్బాతును ఆచరించాలని దేవుడే ఆజ్ఞాపించాడు. ఇది ఆచరించాలని ఆయన ఎవరిని కోరాడు? ధూప మర్పించాలని ఆయన ఆజ్ఞాపించాడు. అయితే క్రైస్తవుల నెవరిని ధూప మర్పించాలని ఆయన ఆజ్ఞాపించలేదు. ఇది ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన నిబంధన. మానవులకు ఆయన సబ్బాతును ఆచరించాలని ఆజ్ఞాపించాడు. సబ్బాతును ఆచరించే ఆజ్ఞ యూదులది మాత్రమే.

### ఇశ్రాయేలీయుల కియ్యబడింది

సబ్బాతును ఆచరించడం ధర్మశాస్త్రంలో ఒక భాగం. అది ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన చట్టమై యున్నది. మనం బైబిలునం దిట్లు చదువగలం: "మరియు యెహోవా మోషేతో ఇట్లనెను. ఈ వాక్యములను వ్రాసికొనుము. ఏలయనగా ఈ వాక్యములను బట్టి నేను నీతోను ఇశ్రాయేలీయులతోను నిబంధన చేసి యున్నాను. అతడు నలువది రేయింబగళ్ళు యెహోవాతో కూడ అక్కడ నుండెను. అతడు భోజనము చేయలేదు, నీళ్ళు త్రాగలేదు. అంతలో ఆ నిబంధన వాక్యములను, అనగా పది ఆజ్ఞలను ఆ పలకలమీద వ్రాసెను" (నిర్గమ 34:27, 28). దేవుడు సబ్బాతును ఆచరించాలనే ఈ నిబంధన ఇశ్రాయేలీయులతో మాత్రమే చేసెను గాని అన్యులతో నైనను లేదా క్రైస్తవులతో నైనను చేయలేదు. దేవుడిట్లు పలుకుచున్నాడు.

"నీవు ఇశ్రాయేలీయులతో నిజముగా మీరు నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరింపవలెను. మిమ్మును పరిశుద్ధపరచు యెహోవాను నేనే అని తెలిసికొనునట్లు అది మీ తరతరములకు నాకును మీకును గురుతగును. కావున మీరు విశ్రాంతి దినము నాచరింపవలెను. నిశ్చయముగా అది మీకు పరిశుద్ధము; దానిని అపవిత్రపరచు వాడు తన ప్రజలలోనుండి కొట్టివేయబడును" (నిర్గమ 31:12, 14). దేవుడు ఒక ప్రయోజనము కొరకు పరిశుద్ధపరచిన దానిని మరియొక ప్రయోజనార్థమై ఉపయోగించలేదు.

దిగువ నీయబడిన లేఖన భాగములు సబ్బాతును యూదుల కొరకు మాత్రమే దేవుడిచ్చెనను సంగతి తెలియజేయుచున్నవి. పరిశీలిద్దాం. "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను. ఇశ్రాయేలీయులారా నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి. (ఈ విషయాన్ని గమనించండి) యెహోవా మన పితరులతో కాదు. (నేడు సబ్బాతును ఆచరించాలని వత్తిడి తీసుకొనివచ్చే మత ప్రపంచం సబ్బాతు ఆదినుండి ఆచరించబడుచున్నదని చెప్పుచున్నారు) నేడు ఇక్కడ సజీవులమై యున్న మనతోనే ఈ నిబంధన చేసెను".

## పితరుల కొరకు కాదు

ఆ నాడు ఇవ్వబడిన చట్టము పితరుల కివ్వబడినది కాదు. "ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తె యైనను నీ దాసుడైనను నీ దాసి యైనను నీ ఎద్దయినను నీ గాడిదయైనను నీ పశువులలో ఏదైనను నీ యిండ్లలో నున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ఎందుకంటే నీవలె నీ దాసుడును నీ దాసియును విశ్రమింప వలెను. (తరువాత వచనము

ముఖ్యంగా పరిశీలించుము). నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహు బలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితీ 5:12-15).

ఇప్పుడు మన ప్రశ్న యేదనగా ఎవరు మాట్లాడుచున్నారు? దేవుడు మాట్లాడుచున్నాడు. ఎవరితో ఆయన మాట్లాడుచున్నాడు? ఆయన యూదులతో ఈ మాటలు పలుకుచున్నాడు. ఈ మాటలు వారి పితరులతో కాదు అక్కడ సజీవులై యున్న యూదులకు ఈ మాటలు చెప్పాడు. కొందరు సబ్బాతు దినాన్ని ఆదినుండి దేవుడు మానవుల కిచ్చినట్లు చెప్పుచున్నారు. దేవుడు ఆనాడు అక్కడ సజీవులై యున్న ఇశ్రాయేలీయులకు దీని నిచ్చాడనే వాక్యానికి విరుద్ధంగా బోధించుచున్నారు.

మోషే ఇలా వ్రాసాడు: "కాబట్టి దేవుడు ఆ యేడవ దినమును ఆశీర్వదించి పరిశుద్ధ పరచెను. ఏలయనగా దానిలో దేవుడు తాను చేసినట్టియు, సృజించినట్టియు తన పని అంతటినుండి విశ్రమించెను" (ఆది 2:3). ఆదాము, అబ్రాహాము లేదా నోవహు దినాల్లో మోషే ఈ విషయం వ్రాయలేదు. ఐగుప్తునుండి పిల్లలైన ఇశ్రాయేలీయులు బయటికి నడిపింపబడిన తరువాత వ్రాయబడినవి. ఇశ్రాయేలీయుల కొరకు ఆయన దానిని పరిశుద్ధ పరచెను. ఇది పితరులకొరకు కాదు. వారు దానిని జ్ఞాపకముంచుకొనునట్లు ఇవ్వబడినది.

ఆదాము, నోవహు, అబ్రాహాములకు దేవుడు సబ్బాతును ఇవ్వలేదు. అది ఆయన ఇశ్రాయేలీయుల కొరకు పరిశుద్ధ పరచెను.

నెహెమ్యా పరిశుద్ధాత్మ శక్తిద్వారా సబ్బాతును గూర్చిన ఆజ్ఞ ఎప్పుడు ఇవ్వబడిందో తెలియ జేసాడు: "సీనాయి పర్వతము

మీదికి దిగివచ్చి ఆకాశమునుండి వారితో మాటలాడి, వారికి నీతి యుక్తమైన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలుకరములైన కట్టడలను ధర్మములను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దిన మును ఆచరింప నాజ్ఞ ఇచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞలను కట్టడలను ధర్మశాస్త్రమును వారికి నియమించితివి" (నెహెమ్యా 9:13-14).

అవును, సబ్బాతు నాచరించుట దేవుని ఆజ్ఞయై యున్నది. సృష్టిలో యేడవ దినమున ఆయన విశ్రమించెను. ఇది మోషే ద్వారా ఆయన ఇశ్రాయేలీయుల కిచ్చాడు. దానిని ఇశ్రాయేలీయుల కొరకు పరిశుద్ధపరిచాడు.

## క్రైస్తవులకు కాదు

దేవుడు అహరోనుకు ఆయన సంతతికి యాజకత్వమును ప్రసా దించెను (సంఖ్యా 3:10). యాజకత్వము ఎల్లప్పుడు అహరోను సంతతికి చెందినదే. అదే విధముగా సబ్బాతు కూడ ఇశ్రాయేలీయులదే. అహ రోను సంతతి క్రమము చొప్పున క్రీస్తు యాజకుడు కాలేదు. అందు చేత సబ్బాతును ఆచరించుట యూదులకు మాత్రమే గాని అన్య జనాంగానికి లేదా క్రైస్తవులకు ఇవ్వబడలేదు.

పాతనిబంధన గ్రంథమునుండి మరొక వచన భాగాన్ని గుర్తు చేస్తున్నాం. "నేను మీ దేవుడనైన యెహోవానని మీరు తెలిసికొను నట్లు ఆ విశ్రాంతి దినములు నాకును మీకును మధ్య సూచనగా ఉండును" (యెహె 20:20). వారు దేవుని నిబంధన జనాంగము. సబ్బాతు దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధన మరియు ధర్మ శాస్త్రమునందలి భాగము. అది పితరులతో చేయబడినది కాదు.

మనం (అన్యులముగా) మనస్థితి ఈ చట్టం క్రింద ఎట్లున్నదో

చూద్దాం. "కాబట్టి మునుపు శరీర విషయములో అన్యజనులై యుండి, శరీరమందు చేతితో చేయబడిన సున్నతి గలవారు అనబడిన వారిచేత సున్నతి లేనివారనబడిన మీరు ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహవాసులు కాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణలేని వారును, లోకమందు దేవుడులేని వారునై యుండి, క్రీస్తుకు దూరస్థులై యుంటిరని, మీరు జ్ఞాపకము చేసికొనుడి. అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు. ఆయనే మన సమాధానమై యుండి, మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధి రూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్య గోడను పడగొట్టి, మన ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధి చేయుచు, ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించెను" (ఎఫె 2:11-15). ధర్మశాస్త్రము దేవునికి, యూదులకు మధ్య నిబంధన యని నేర్చుకొన్నాం. అన్యులముగా మనము దేవుడు లేనివారము, నిరీక్షణ లేనివారము, వాగ్దానము లేనివారము. క్రీస్తునందు దేవుని యెదుట అందరం సమానంగా నిలబడ్డాం.

## ధర్మశాస్త్రంలో భాగం

సబ్బాతు నాచరించుట ధర్మశాస్త్రంలో ఒక భాగమై యున్నది. అది నిరంతరము దేవునికి యూదులకు మధ్య ఒక సూచనగా నున్నది. ధూప దీప నైవేద్యాలర్పించడం, జంతుబలులు మరియు సబ్బాతు నాచరించడం ధర్మశాస్త్రంలో భాగం. అహరోను యాజకత్వం క్రింద ఈ చట్టం ఇవ్వబడినది. క్రొత్తనిబంధన క్రీస్తు యాజకత్వం క్రింద ఇవ్వబడినది. "ఆ లేవీయులు యాజకులై యుండగా ప్రజలకు ధర్మశాస్త్ర మియ్యబడెను. గనుక ఆ యాజకులవలన సంపూర్ణ సిద్ధి కలిగిన యెడల అహరోను క్రమములో చేరినవాడని చెప్పబడక మెల్కీసెదెకు

క్రియముచొప్పున వేరొక యాజకుడు రావలసిన అవసరమేమి? ఇదియు గాక యాజకులు మార్చబడినందున అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును" (హెబ్రీ 7:11,12). ధర్మశాస్త్రము క్రింద వారు జంతు బలుల నర్పించిరి. అలాగు ఇప్పుడు మనము చేయుదమా? చేయకూడదు. ఎందుచేత? ధర్మశాస్త్రము మార్చబడెను. మనమిట్లు చాలా ఉదాహరణలు ఇవ్వగలం. కాని ఇంకనూ సబ్బాతు నాచరించాలని చెప్పేవారున్నారు. మనం దేవుని వాక్యభాగాన్ని ఇంకా చదువుదాం: "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధు లందరు శాపమునకు లోనై యున్నారు. ఎందుకనగా - ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయ బడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు" (గలతి 3:10). ధర్మశాస్త్ర గ్రంథములోనున్న జంతు బలులు, ధూప ద్రవ్యములు యింకా మిగిలిన సంగతులు ఈనాడు అవసరం లేదని సబ్బాతును మాత్రమే ఆచరించాలని కొందరు చెప్పు చున్నారు. అయితే వీరు శాపగ్రస్తులని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు. అయితే వారిలో ఒకనిగా నుండుటకు నేనిష్టపడను. మరి నీవు?

## పరిశుద్ధాత్ముడి నిర్ణయం

ఆదిమ సంఘములో కలవరం బయలుదేరింది. యూదా మతము నుండి క్రైస్తవులైనవారు ధర్మశాస్త్రానుసారంగా సున్నతి పొందితేనే గాని రక్షణ లేదని బోధింప మొదలు పెట్టిరి.

యెరూషలేములో అందరు కూడుకొనిరి. పరిశుద్ధాత్మ సంరక్షణలో ఈ కూడిక ఏర్పాటయ్యెను.

నాలుగు సంగతులు వారు నిర్ణయించిరి.

1. విగ్రహములకు దూరముగా నుండుట
2. జారత్వమునకు దూరముగా నుండుట.
3. గొంతు పిసికి చంపినవాటిని తినరాదు.
4. రక్తము త్రాగరాదు.

సబ్బాతును గూర్చి అక్కడ ప్రస్తావించబడలేదు. ఈ విష యాన్ని మరి విపులంగా తెలిసికొందాం: "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీది చేవ్రాతను తుడిచి వేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధము లన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపజేసెను. కాబట్టి అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతి దినము అను వాటి విషయములోనైనను, మీకు తీర్పు తీర్చ నెవనికి అవకాశమియ్యకుడి" (కొలస్స 2:14-16).

నా స్నేహితులారా, జ్ఞాపకముంచుకొనుడి. "కాబట్టి మనము విశ్వాసమువలన నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడి యాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతి 3.24-25). మనము ధర్మశాస్త్ర విషయములో మృతిపొంది క్రీస్తుకు పెండ్లి చేయబడితిమి (రోమా 7:1-4). ధర్మశాస్త్రము ఇంకనూ నిలిచియుంటే, మనము క్రీస్తుతో పెండ్లి చేయబడిన వారము కాము. ధర్మశాస్త్రము నేడు అమలులో లేదని ఎన్నో దేవుని వాక్య భాగాలు సెలవిచ్చుచున్నవి. స్థిరపర్చబడిన లేఖనాలు అనగా వాక్యము మనకు ఇవ్వబడినది.

ఈ ఆఖరి వచనాన్ని చదువుదాం: "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు" (రోమా 10:4). నీవు క్రీస్తును నమ్ముచున్నావా? మృతమైన ధర్మ శాస్త్రాన్ని జీవింపజేయుచున్న మనుష్యుల నిరర్థక తత్వ జ్ఞానాన్ని నమ్ముచున్నావా?

## కేథలిక్కుల అబద్ధం

సబ్బాతు ఆదివారానికి మార్చబడెనని కేథలిక్కులు చెప్పు

దురు. వారు అబద్ధ మాడుచున్నారు. వారు అబద్ధ మాడినట్లు వారికి తెలియకపోతే, వారు సంఘ చరిత్ర చదవవలసి యున్నది. మత శాఖల వారు మరల అదే విషయాన్ని చెప్పుచున్న యెడల వారు క్రొత్త నిబంధనను, సంఘ చరిత్రను చదవాలి గాని కేథలిక్కుల అబద్ధ సిద్ధాంతాన్ని కాదు.

క్రీస్తుకు బదులుగా మరియ మధ్యవర్తి యని వారు నమ్ముచున్నారా? అవును. క్రీస్తుకు బదులు పోపు యాజకుడని వారు నమ్ముచున్నారా? అవును. ఒక అబద్ధాన్ని నమ్మడం కొరకు నిజాన్ని తిరస్కరించుచున్నారు.

"ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడి క్రింద చిక్కుకొనకుడి" (గలతి 5:1).

రక్షణ క్రీస్తునందున్నది. మనుష్యుల పారంపర్యాచారముల నుండి స్వాతంత్ర్యము నీకు క్రీస్తునుండి లభించును. —జె.సి. బెయిలీ.

---

## దేవుని వాక్యము

1. తేనవంటిది :-"నీ వాక్యములు నా జిహ్వకు ఎంతో మధురములు. అవి నా నోటికి తేనెకంటె తీపిగా నున్నవి" (కీర్తనలు 119:103).

"తేనెకంటెను జుంటితేనె ధారలకంటెను మధురమైనవి" (కీర్తనలు 19:10).

2. మేలిమి బంగారము వంటిది :-"అవి బంగారుకంటెను విస్తారమైన మేలిమి బంగారుకంటెను కోరదగినవి" (కీర్తనలు 19:10).

"వేలకొలది వెండి బంగారు నాణెములకంటె నీ విచ్చిన ధర్మశాస్త్రము నాకు మేలు" (కీర్తనలు 119.72).

3. దీపము, వెలుగు వంటిది :-"నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది" (కీర్తనలు 119 : 105).

"మరియు ఇంతకంటె స్థిరమైన ప్రవచన వాక్యము మనకున్నది. తెల్లవారి వేకువచుక్క మీ హృదయములలో ఉదయించు వరకు ఆ వాక్యము చీకటిగల చోటున వెలుగిచ్చు దీపమైనటున్నది. దాని యందు మీరు లక్ష్యముంచిన యెడల మీకు మేలు" (2 పేతురు 1:19).

4. అగ్నివంటిది :-"నా మాట అగ్ని వంటిది కాదా ?" (యిర్మియా 23 : 29).

"అప్పుడు వారు - ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు బోధపరచు చున్నప్పుడు మన హృదయము మనలో మండుచుండలేదా అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి" (లూకా 24 : 32).

5. ఆహారమువంటిది :-"నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని. సైన్యముల కధిపతియగు యెహోవా, దేవా, నీ పేరు నాకు పెట్టబడెను. గనుక నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి" (యిర్మియా 15 : 16).

"ఆయన పెదవుల ఆజ్ఞను నేను విడిచి తిరుగలేదు. ఆయన నోటి మాటలను నా స్వాభిప్రాయము కంటె ఎక్కువగా ఎంచితిని" (యోబు 23 : 12).

6. విత్తనము వంటిది :-"ఈ ఉపమాన భావ మేమనగా, విత్తనము దేవుని వాక్యము" (లూకా 8 : 11).

"మీరు క్షయ బీజమునుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడిన

వారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు, మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనినవారై యుండి, యొకనినొకడు హృదయపూర్వకము గాను మిక్కటముగాను ప్రేమించుడి" (1 పేతురు 1 : 23).

7. సుత్తెవంటిది :-"ఇదే యెహోవా వాక్కు నా మాట అగ్ని వంటిది కాదా? బండను బద్దలుచేయు సుత్తివంటిది కాదా?" (యిర్మీయా 23 : 29).

8. ఖడ్గమువంటిది :-"మరియు రక్షణ యను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి" (ఎఫెసి 6 : 17). "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4 : 12).

9. నీటివంటిది :-"మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానముద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను" (తీతు 3 : 5).

10. పాలవంటిది; బలమైన ఆహారము :-మీరు పాలు త్రాగవలసిన వారే గాని బలమైన ఆహారము తినగలవారు కారు. మరియు పాలుత్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్య విషయములో అనుభవము లేనివాడై యున్నాడు. వయస్సు వచ్చిన వారు అభ్యాసముచేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును" (హెబ్రీ 5·12; 14).

క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి" (1 పేతురు 2:3).

11. అద్దము వంటిది :- "ఎవడైనను వాక్యమును వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు" (యాకోబు 1:23).

"మన మందరమును ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3:18).

12. జీవ వాక్యము :- "అట్టి జనము మధ్యను మీరు జీవవాక్యమును చేత పట్టుకొని, లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు. అందు వలన నేను వ్యర్థముగా పరుగెత్తలేదనియు నేను పడిన కష్టము నిష్ప్రయోజనము కాలేదనియు క్రీస్తు దినమున నాకు అతిశయ కారణము కలుగును" (ఫిలిప్పీ 2:16).

"మీరు క్షయబీజమునుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలముగా జన్మించిరి" (1 పేతురు 1:23).

ప్రియ చదువరీ! నీవు దేవుని వాక్యమునకు లోబడితివా? లేనిచో నేడే లోబడుము. అందుచేత దేవుని వాక్యమును విని, విశ్వసించి, మనస్సు పొంది నీ పాపములను ఒప్పుకొని బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవు రక్షించబడెదవు.

"సర్వ శరీరులు గడ్డిని పోలినవారు, వారి అందమంతయు గడ్డి పువ్వువలె ఉన్నది. గడ్డి ఎండును. దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును. మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" (1 పేతురు 1:24).

★

—ఇనుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ-4.

# ప్రత్యేక ఆహ్వానము

# BIBLE SEMINAR

## AT KAKINADA

**1988 డిశంబరు 10 నుండి 16 వరకు**

ప్రసంగీకులు : Bro. పెర్రి కోతమ్, USA

(గొప్ప బైబిలు విద్యాంసులు)

భోజన వసతులు ఉచితం.

అందరికీ ఆహ్వానం ! అందరికీ మా స్వాగతం !!

వివరములకు : **KAKINADA SCHOOL OF PREACHING**

**Kakinada_533 004**